క్లుప్తంగా

ప్రకృతివనంలో పరిశుభ్రత చర్యలు



శాంతినగర్: వడ్డేపల్లి పుర పరిధిలోని ఐదో వార్డులో ఏర్పాటు చేసిన పట్టణ ప్రకృతివనంలో మున్సిపల్ సిబ్బంది సోమవారం పరిశుభ్రత చర్యలు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షాలకు ప్రకృతివనంలో గడ్డి, పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. అధికారుల ఆదేశాల మేరకు మున్సిపల్ సిబ్బంది పిచ్చిమొక్కలను, గడ్డి తొలగించే పనులు చేపట్టారు. ప్రకృతివనానికి వచ్చే వారికి ఇబ్బందికరంగా మారినందున పరిశుభ్రత చర్యలు చేపడుతున్నట్లు సిబ్బంది పేర్కొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పుచేయించుకోవాలి



ధరూరు: ప్రతి ఒక్క గర్భిణి ప్రభుత్వ ఆస్పత్రిలోనే కాన్పు చేయించుకోవాలని ఉప్పేరు పీహెచ్‌సీ డాక్టర్ ఏంజిల్ అన్నారు. సోమవారం పీహెచ్‌సీ పరిధిలోని అనంతపురంలో గర్భిణులను పరీక్షించారు. ఈ సందర్భంగా వారికి పలు సూచనలు, సలహాలు చేశారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పు చేయించుకోవడం ఉత్తమమైన మార్గమన్నారు. మొదటి సారి గర్భం దాల్చిన వారు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి తగినంత పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. గ్రామంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు లక్ష్మి, విజయభాస్కర్, ఏఎస్‌ఎం కవిత, ఆశా వర్కర్ తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ కనెక్షన్‌తో తీరిన కష్టాలు



జోగుళాంబ శక్తిపీఠం: అలంపూర్‌లో కేంద్ర ప్రభుత్వ రూ.37 కోట్లతో నిర్మించిన ప్రసాద్ స్కీం భవనానికి మిషన్ భగీరథ పైప్‌లైన్ కనెక్షన్‌తో నీటి కష్టాలు తొలగి పోయాయి. భవన నిర్మాణం ఫేస్–1 పనులు పూర్తి కావడంతో ప్రభుత్వం జోగుళాంబ ఆలయానికి ప్రసాద్ స్కీం భవనంలోని భోజన శాలను అప్పగించింది. ఇక్కడ నీటి సౌలభ్యం లేక పోవడంతో దేవస్థానం వారు ఈ భవనాన్ని తమ ఆధీనంలోకి తీసుకోలేదు. ఈ విషయం తెలుసుకున్న కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడటంతో మిషన్ భగీరథ పైప్‌లైన్ కనెక్షన్ ఇప్పించారు. దీంతో భవనంలో నీటి సమస్య తీరింది. సోమవారం సాయంత్రం నీటి లభ్యతను ఆలయ ఈఓ పురేందర్‌కుమార్, స్థానిక తహసీల్దార్ మంజుల పరిశీలించారు.

బస్సు డ్రైవర్ నిర్లక్ష్యం: విద్యార్థికి గాయం



మానవపాడు: వర్షాలతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లలంటే ఇబ్బందులు తప్పడం లేదు. దానికి తోడు ప్రైవేట్ పాఠశాలల బస్సు డ్రైవర్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. సోమవారం అలంపూర్‌చౌరస్తాలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు చెన్నిపాడు, చిన్నపోతులపాడు, పెద్దపోతులపాడు గ్రామాలలో విద్యార్థులను బస్సులో ఎక్కించుకొని పాఠశాలకు వెళ్తుండగా, బ్రేకులు సడెన్‌గా వేయడంతో విద్యార్థి కిందపడి గాయమైంది. వెంటనే కర్నూల్ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి కుట్లు వేసి చికిత్స అందించారు. విద్యార్థులకు తల్లిదండ్రులు బస్సులో విద్యార్థులు పెట్టుకొని ఇంత నిర్లక్ష్యంగా నడపడమేంటని ప్రశ్నిస్తున్నారు. ఇంత ర్యాస్ డ్రైవింగ్ పట్ల ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు వేడుకోంటున్నారు.

పాఠశాలకు కుర్చీల వితరణ



అలంపూర్: విద్య నేర్చుకున్న పాఠశాలకు పూర్వపు విద్యార్థులు కుర్చీలను వితరణ చేశారు. అలంపూర్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు 1981–82 బ్యాచ్‌కు చెందిన పూర్వపు 10వ తరగతి విద్యార్థులు సోమవారం కుర్చీలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసులకు అందజేశారు. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించినట్లు తెలిపారు. ఇదే బ్యాచ్ పూర్వపు విద్యార్థులు పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థుల కోసం రూ.1.50 లక్షలతో టాయిలెట్స్, బాత్‌రూంలు నిర్మించినట్లు తెలిపారు.

కాళోజీకి ఘన నివాళి



గద్వాలలో కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



తుమ్మలచెరువు పాఠశాలలో కాళోజీకి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



అమరవాయిలో కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రధానోపాధ్యాయులు



ఇటిక్యాలలో నివాళులర్పిస్తున్న తహసీల్దార్

గద్వాల అర్బన్: ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి వేడుకలు జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ సరిత కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో మధుసూదన్ బాబు, వెంకట్రామిరెడ్డి, భాస్కర్ యాదవ్, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాసులు, జమ్మిచేడు ఆనంద్ ఉన్నారు.

ఉండవెల్లి: పుల్లూరు మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విద్యాసంస్థల్లో కాళోజీ నారాయణరావు జయంతిని ప్రిన్సిపల్ దేవానందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురుకుల పాఠశాలలో భాషా దినోత్సవాన్ని నిర్వహించారు.

గట్టు: మండలంలోని తుమ్మలచెరువు ప్రాథమికోన్నత పాఠశాలలో తెలంగాణ భాషా దినోత్సవం సందర్భంగా కాళోజీ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. పద్యాల పోటీ, పఠన పోటీ, చిరు కవిత పోటీ, తెలుగు క్విజ్ కార్యక్రమాలు నిర్వహించారు.

మల్దకల్: మండలంలోని అమరవాయి, బిజ్వారం, విఠలాపురం, నీలిపల్లి, తాటికుంట, పాల్వాయి గ్రామాల్లోని ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కృష్ణ, అధ్యాపకులు రామాంజనేయులుగౌడ్, నర్సింహులు, భాగ్యలక్ష్మి, ప్రధానోపాధ్యాయులు నరేష్, సురేష్ ఉన్నారు.

అయిజ: పట్టణలో బీజేపీ జిల్లా అధ్యక్షులు రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో కాళోజి జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బీమ్‌సేన్‌రావ్, పట్టణ కో కన్వీనర్ కంపాటి భగత్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రవల్లి: ఇటిక్యాల మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో కాళోజీ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ నరేందర్ కాళోజీ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఆర్ఐ భీమ్‌సేన్‌రావు, అధికారులు, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

మున్సిపల్ సమస్యలు పరిష్కరించండి

- సీడీఎంఏను కలిసిన మున్సిపల్ చైర్‌పర్సన్



వినతి పత్రం అందజేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్

అలంపూర్: మున్సిపాలిటీలోని సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ సీడీఎంఏను కోరినట్లు తెలిపారు. హైదరాబాద్‌లోని సీడీఎంఏ కార్యాలయంలో కమిషనర్ అండ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ గౌతంను అలంపూర్ మున్సిపల్ చైర్‌పర్సన్ మనోరమ సోమవారం కలిసినట్లు తెలిపారు. మున్సిపల్ కార్మికుల వేతనాల చెల్లింపులు, పెండింగ్ రోడ్ల పనులకు, మున్సిపాలిటీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను కమిషనర్‌కు వివరించినట్లు తెలిపారు. అనంతరం వినతి పత్రం అందజేశారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



టైర్లతో డివైడర్ ఏర్పాటు చేస్తున్న పోలీసులు

శాంతినగర్: వడ్డేపల్లి పుర పరిధిలోని శాంతినగర్‌లో ట్రాఫిక్ నియంత్రణకు పోలీసులు చర్యలు చేపట్టారు. అంబేడ్కర్ చౌరస్తాలో డివైడర్ లేనందున తరచు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అలంపూర్–రాయచూర్ ప్రధాన రహదారిపై అంబేడ్కర్ చౌరస్తాలో అటు రాజోళి, ఇటు కోయిల్‌దిన్నె ప్రధాన రహదారులున్నాయి. అంతర్రాష్ట్ర రహదారితో పాటు ఆయా గ్రామాలకు వెళ్లే ప్రయాణికులతో సెంటర్ రద్దీగా ఉంటుంది. స్పందించిన ఎస్ఐ సంతోష్ సిబ్బందితో వచ్చి పెద్ద ట్రాక్టర్ టైర్లకు రేడియం స్టిక్కర్లు, రంగు వేయించి తాత్కాలికంగా డివైడర్ ఏర్పాటు చేయించారు. ఇరువైపుల బార్కెడ్‌లు ఏర్పాటు చేయడంతో ట్రాఫిక్ నియంత్రణతో పాటు ప్రమాదాలు జరగకుండా ఎస్ఐ చర్యలు చేపట్టారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అమరవాయి విద్యార్థి



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని అభినందిస్తున్న హెచ్ఎం నరేష్, ఉపాధ్యాయులు

మల్దకల్: మండలంలోని అమరవాయి జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి రామాంజనేయులు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు నరేష్ తెలిపారు. సోమవారం స్థానిక జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థి రామాంజనేయులును సన్మానించారు. ఈ సందర్భంగా నరేష్ మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్లలో 8న జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలలో రామాంజనేయులు ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. ఈనెల 14న హనుమకొండలో రాష్ట్రస్థాయిలో జరిగే హ్యాండ్‌బాల్ పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ మరియమ్మ, పాఠశాల ఉపాధ్యాయులు సుమలత, ధనుంజయ, ఆనంద్‌కుమార్, రవికుమార్, వీరన్న, అరుణరాణిలు ఉన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజలకు అందిస్తాం

- ఎమ్మెల్యే విజయుడు



సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూస్తామని ఎమ్మెల్యే విజయుడు అన్నారు. కర్నూల్‌లోని ఎమ్మెల్సీ నివాసంలో సీఎం సహాయ నిధి చెక్కులను సోమవారం ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. అయిజ మండలం ఉత్తనూరు గ్రామానికి చెందిన వెంకన్న వైద్య ఖర్చుల నిమిత్తం దరఖాస్తు చేసుకోగా, సీఎం సహాయ నిధి ద్వారా రూ.37,500 చెక్కు మంజూరైనట్లు తెలిపారు. ఇటిక్యాల మండలం బుద్దారెడ్డిపల్లికి చెందిన జగదీష్‌కు వైద్య ఖర్చులకు నిమిత్తం సీఎం సహాయ నిధి ద్వారా రూ.6 వేల చెక్కు మంజూరైనట్లు ఎమ్మెల్యే తెలిపారు. వారితో పాటు నాయకులు, లబ్ధిదారులు, తదితరులు ఉన్నారు.

పోషణపై అవగాహన కల్పించాలి



ఉండవెల్లిలో చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న సీడీపీఓ సుజాత



మానవపాడులో సీమంతం చేస్తున్న సీడీపీఓ

ఉండవెల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు వారి తల్లులకు ఎలాంటి ఆహారం ఏర్పాటు చేయాలో పోషణ అభియాన్ కార్యక్రమంలో సీడీపీఓ సుజాత అవగాహన కల్పించారు. సోమవారం అంగన్‌వాడీ–6వ కేంద్రంలో మండల సూపర్‌వైజర్ ఆస్మా ఆధ్వర్యంలో సీడీపీఓ పోషణ అభియాన్ కార్యక్రమంలో చిన్నారులకు అన్నప్రాసన చేశారు. శ్యాం మ్యాం పిల్లలకు బాలామృతం ప్లస్‌ను అందించాలని తెలిపారు. హాజరు శాతాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసం

మానవపాడు: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం పోషణమాసం సందర్భంగా ఐసీడీఎస్, సీడీపీఓ సుజాత ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతం, పిల్లలకు అన్నప్రసన, అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. 'భేటీ బచావో–భేటీ పడావో' కార్యక్రమంలో భాగంగా ప్రీ స్కూల్‌లో పిల్లలకు కథల పుస్తకాలు చదివించడం జరుగుతుందన్నారు. వివిధ రకాల పోషకాలతో కూడిన ఆహారపదార్థాలు ప్రదర్శించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, పోషణ్ అభియాన్ సురేష్, అంగన్‌వాడీ టీచర్స్ సుమిత్ర, విమల, శ్రీలత, చెన్నమ్మ, జయమ్మ, కృష్ణవేణి పాల్గొన్నారు.

గట్టు: గర్భిణులు, బాలింతలు పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనాన్ని సాగించవచ్చని నీతి అయోగ్ జిల్లా కోఆర్డినేటర్ అఫ్జల్, మల్దకల్ ప్రాజెక్టు సీడీపీఓ నాగరాణిలు తెలిపారు. పోషణ మాసంలో భాగంగా మండల కేంద్రంలో 3, 5వ అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అఫ్జల్, నాగరాణిలు మాట్లాడుతూ రక్త హీనతను దూరం చేయడానికి ఆకు కూరలు, పండ్లుతో పాటుగా సమతూల్య ఆహారం తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ సంధ్యారాణి, ఏఎస్‌ఎం పార్వతి, అంగన్‌వాడీ టీచర్లు వెంకట్రావమ్మ, ఉమామహేశ్వరి, సుజాతమ్మ, సరస్వతి, రాజేశ్వరి, ఆశా వర్కర్లు సంగీత, సరళ. హారతి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.


భయం గుప్పిట్లో లింగాపురం రైతులు



చిన్నోనిపల్లె రిజర్వాయర్ కట్ట గ్యాప్‌ను పూడ్చిన వరకు వచ్చిన నీరు

గట్టు: చిన్నోనిపల్లె రిజర్వాయర్‌లో క్రమ క్రమంగా పెరుగుతున్న నీటి మట్టం కారణంగా ఇప్పటి దాకా చిన్నోనిపల్లె గ్రామస్తులు మాత్రమే భయంతో వణికి పోయారు. రిజర్వాయర్ నీరు ఇళ్ల మధ్యకు చేరడంతో ఒక్కొక్కరుగా ఊరు వదిలి పునరావాస కేంద్రం వైపు అడుగులు వేస్తున్నారు. రిజర్వాయర్‌లో నీటి మట్టం పెరడంతో లింగాపురం, బోయలగూడెం గ్రామాల రైతులకు భయం పట్టుకుంది. గతంలో చిన్నోనిపల్లె గ్రామం చుట్టూ ఉన్న వాగుల్లోని నీరు రిజర్వాయర్ కట్ట గ్యాప్ ద్వారా బయటకు వెళ్లేవి. గతేడాది గండిని పూడ్చేశారు. ఇటీవల వరుసగా కురుస్తున్న మోస్తరు నుంచి భారీ వర్షాలకు చిన్నోనిపల్లె రిజర్వాయర్‌లోకి వర్షపు నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం రిజర్వాయర్ కట్ట గ్యాప్‌ను పూడ్చిన వరకు నీరు చేరింది. భారీ వర్షాలు కురిస్తే రిజర్వాయర్ కట్ట గ్యాప్ ఎక్కి పారే అవకాశం ఉందని లింగాపురం, బోయలగూడెం గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. నీటి ఉధృతికి సగం వరకు పూడ్చిన రిజర్వాయర్ కట్టగ్యాప్‌ను తెంపుకుని నీటి ప్రవాహం ముందుకు సాగితే లింగాపురంతో పాటు చుట్టు పక్కల రైతుల పొలాలు పూర్తిగా దెబ్బతినే అవకాశం ఉంది. రిజర్వాయర్‌లో నీటి మట్టం పెరగకుండా సమాంతర కాల్వను ఏర్పాటు చేయడం ద్వారా అదనపు నీరు బయటకు వెళుతుందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అధికారులు చెబుతున్నారు. రిజర్వాయర్‌ను సందర్శించిన ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సైతం లింగాపురం, బోయలగూడెం గ్రామాలకు చెందిన రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రిజర్వాయర్ కట్ట తెగిపోకుండా అధికారులు చర్యలు తీసుకునే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. రాత్రికి రాత్రి భారీ వర్షాలు కురిస్తే పరిస్థితి ఎంటని, చిన్నోనిపల్లె రిజర్వాయర్ కట్ట కింద భూములున్న రైతులు ఆందోళన చెందుతున్నారు.

వ్యక్తి అదృశ్యం



ఎర్రవల్లి: ఎర్రవల్లి మండలంలోని కొండేరుకు చెందిన బోయ రాజు ఇంట్లో గొడవ జరగడంతో మనస్థాపానికి గురై గత నెల 16న ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. అతని కోసం కుటుంబ సభ్యులు చుట్టు పక్కల గ్రామాలు, బంధువుల గ్రామాలలో ఆరా తీయడంతో పాటుగా ఈ నెల 1న ఇటిక్యాల పీఎస్‌లో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎలాంటి ఆచూకీ లభించలేదు. అదృశ్యమైన బోయ రాజు ఆచూకీ తెలిసిన వారు కుటుంబ సభ్యుల ఫోన్ నెంబర్ 9701915271 కు సమాచారం అందిస్తే వారికి రూ.5వేల నగదు ఇవ్వనున్నట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు.

16వ ఆర్థిక సంఘం సమావేశంలో మున్సిపల్ చైర్మన్

గద్వాల: హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో సోమవారం జరిగిన 16వ ఆర్థిక సంఘం ప్రణాళిక సమావేశంలో గద్వాల మున్సిపల్ చైర్మన్ బీఎస్ కేశవ్ పాల్గొన్నారు. కేంద్రం నుంచి 16వ ఆర్థిక ఫైనాన్స్ చైర్మన్ డీఆర్ అరవింద్ పంగారియా సమావేశంలో పాల్గొని సలహాలు, సూచనలు ఇచ్చినట్లు బీఎస్ కేశవ్ తెలిపారు.

రోడ్డు వెడల్పు తగ్గించండి

అయిజ: పట్టణంలో చేపట్టిన రోడ్డు వెడల్పు పనుల్లో భాగంగా విస్తీర్ణాన్ని తగ్గించాలని పట్టణ ప్రజలు మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, వైస్ చైర్మన్ నరసింహులుకు పట్టణ ప్రజలు వినతి పత్రం అందజేశారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గద్వాల అర్బన్: జిల్లా కేంద్రంలోని నదిఅగ్రహారంలో వినాయక నిమజ్జనం సందర్భంగా లూజ్‌గా ఉన్న విద్యుత్ లైన్లను సరి చేయనున్న నేపథ్యంలో మంగళవారం ఉదయం 7గంటల నుంచి 10గంటల వరకు వెంకంపేట, నది అగ్రహారం, ఇండస్ట్రీయల్ ఏరియాలో విద్యుత్ సరఫరాను నిలిపేయనున్నట్లు విద్యుత్‌శాఖ టౌన్ ఏఈ శివకుమార్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అదేవిధంగా ఒరిగిన ట్రాన్స్‌ఫార్మర్లు, పబ్లిక్ ట్రాన్స్‌ఫార్మర్లు సరి చేయనున్న నేపథ్యంలో మధ్యాహ్నం 2:30గంటల నుంచి 3:30గంటల వరకు జిల్లా కేంద్రంలోని గంజిపేట, చెనుగొనిపల్లి రోడ్డు, బుర్దపేట, గాంధీచౌక్, న్యూబస్టాండు, సుంకులమ్మ మెట్టు, గంటవీధి, కృష్ణారెడ్డి బంగ్లా ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

కూలిన ఇళ్లకు పరిహారం ఇవ్వాలి

రాజోళి: వారం రోజులకు పైగా కురుస్తున్న వర్షాలకు నేల కూలిన ఇళ్లకు పరిహారం ఇవ్వాలని సీపీఎం మండల కార్యదర్శి విజయ్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. మండల కేంద్రంతో పాటు పచ్చర్ల, మాన్‌దొడ్డి తదితర గ్రామాల్లో ఇళ్లు, మట్టి మిద్దెలు నేలకూలిపోగా, బాధితులు గూడు లేక విలవిలాడుతున్నారని పేర్కొన్నారు. వారికి వెంటనే ఇందిరమ్మ ఇంటిని మంజూరు చేయాలని, అప్పటిదాకా వారు నివాసం ఉండేందుకు, గృహం, బియ్యం, వంట సామగ్రి తదితరాలను అందించాలని తెలిపారు. మండలంలో ఎక్కడెక్కడ ఇళ్లు పూర్తిగా, పాక్షికంగా దెబ్బతిన్నాయో వాటిపై సర్వే నిర్వహించాలని పేర్కొన్నారు.

హైదరాబాద్‌కు తరలిన చేనేత కార్మికులు



గట్టు: హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డితో నిర్వహించే సమావేశానికి మండల కేంద్రానికి చెందిన చేనేత కార్మికులు సోమవారం బస్సుల్లో తరలి వెళ్లారు. చేనేత జౌళీ శాఖ అధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి చేనేత కార్మికులు పెద్ద ఎత్తున తరలి వెళ్లారు. కార్యక్రమంలో చేనేత కార్మికులు దోమ వీరన్న, జయన్న, చంద్రశేఖర్, గోవిందు, మెడికల్ జయన్న, త్యాగరాజు, నర్సింహులు, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో వసతులు కల్పించాలి

అయిజ: మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో మౌలిక వసతులు ఏర్పాటు చేయ్యాలని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య పేర్కొన్నారు. విద్యార్థులకు నీటి కష్టాలు అధికంగా ఉన్నాయని, సమస్యను ఉన్నతాధికారులకు తెలిపి పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కమ్మేసిన మబ్బులు..



ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో వర్షం తగ్గుముఖం పట్టకపోవడంతో రైతులకు పంట పొలాల్లో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. రోజూ కురుస్తున్న వర్షానికి పత్తి పంటలో మొగ్గలు నల్లబారిపోతున్నాయి. రైతులకు ఈ సారి కూడా పత్తి పంటలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సోమవారం ఉదయం కమ్మేసిన మబ్బులతో ఆకాశాన్ని తలపిస్తున్న ప్రకృతి కనిపిస్తోంది. ఆదివారం రాత్రి మోస్తరు వర్షం కురిసింది.

బడీడు పిల్లలందరూ బడిలో ఉండాలి



విద్యార్థితో మాట్లాడుతున్న స్పెషల్ ఆఫీసర్ అక్బర్

కేటీదొడ్డి: బడీడు పిల్లలందరూ బడిలో ఉండాలని, వారితో పనులు చేయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని మండల స్పెషల్ ఆఫీసర్ అక్బర్ అన్నారు. సోమవారం మండలంలోని ఈర్లబండ, పాతపాలెం వివిధ గ్రామాల్లో పత్తి పనులు చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. పిల్లలను బడికి పంపే విధంగా ఒప్పించారు. బడీడు పిల్లలను పనులు చేయించడం నేరమన్నారు. 37 మంది విద్యార్థులను కలిసి 11 మంది పిల్లలను బడికి తీసుకొచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కృష్ణమోహన్, ఎంఈఓ సురేష్, హెచ్‌ఎంలు తదితరులు ఉన్నారు.

ఘనంగా గణనాథుల నిమజ్జనం



క్యాతూర్‌లో నిమజ్జనానికి తరలిస్తున్న గణనాథుడు



తుంగభద్ర నది దగ్గర ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఇన్‌చార్జి ఎస్ఐ బాషా

అలంపూర్ రూరల్: గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు గణనాథులకు ప్రత్యేక పూజలు చేశారు. వాడవాడలో వెలసిన వినాయకులు వివిధ రూపాల్లో దర్శనం ఇస్తు పూజలందుకున్నారు. మండపాల దగ్గర సందడి నెలకొంటుంది. అలంపూర్ పట్టణంలో క్రాంతి యువజన సంఘం. ఆర్యవైశ్య సంఘం, అక్బర్ పేట, కట్టెల పేట, అంబేడ్కర్ కాలనీ, న్యూప్లాట్స్, చేనేత కాలనీ, పాత బస్టాండ్, గ్రామాల్లో వినాయకులను ఏర్పాటు చేశారు.

లడ్డు వేలం : కట్టెలపేట వీధిలో ఏర్పాటు చేసిన వినాయక మండపం దగ్గర మూడు రోజులపాటు పూజలందుకున్న గణేశుడి లడ్డు వేలం నిర్వహించారు. గడిగే నాగయ్య రూ.7016 దక్కించుకున్నారు. కళశాన్ని సరస్వతమ్మ రూ.3300లకు దక్కించుకున్నారు.

ఘనంగా నిమజ్జనం : మండలంలోని గ్రామాల్లో మూడు రోజులు పూజలందుకున్న వినాయకులను ఘనంగా పూరవీధుల గుండా ఊరేగించి తుంగభద్ర నదిలో నిమజ్జనం చేశారు. క్యాతూర్‌లో మూడు వినాయకులు, అలంపూర్‌లో 2 వినాయకులు నిమజ్జనం నిర్వహించారు.

మండపాల వద్ద పోలీసుల పరిశీలన

మండలంలోని గ్రామాల్లో, అలంపూర్ మున్సిపాలిటీలో వినాయక మండపాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. నిర్వాహకులు ఆన్‌లైన్లో చేసుకున్న దరఖాస్తుల క్యూర్ కోడ్ పరిశీలించి, ఇతరులకు ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని ఇన్‌చార్జి ఎస్ఐ బాషా సూచించారు. తుంగభద్ర నది దగ్గర నిమజ్జనం చేసే ప్రదేశాన్ని ఆయన పరిశీలించి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

మానవపాడు: మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీఓ భాస్కర్ ఆధ్వర్యంలో వినాయకునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో వినాయకునికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

మరమ్మతు చేపట్టాలి

మల్దకల్: గద్వాల–అయిజ ప్రధాన రహదారిలోని పెద్దపల్లి నుంచి నాగర్‌దొడ్డి వరకు ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టాలని బహుజన సమాజ్ పార్టీ బండారి రాజు కోరారు. సోమవారం మండలంలోని సద్దలోనిపల్లి స్టేజీ సమీపంలో రోడ్డుపై ఏర్పడిన గుంతలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లన్నీ గుంతలమయంగా మారడంతో పాటు గతంలో అక్కడక్కడ రైతులు పొలాలకు పైపులైన్లు ఏర్పాటు చేసుకోవడంతో రోడ్లపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వాటిని గమనించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు రోడ్లపై ఏర్పడిన గుంతలకు మరమ్మతులు చేపట్టాలని కోరారు.

ఉపాధి హామీ పనుల్లో అవకతవకలు

కేటీదొడ్డి: మండలంలోని 23 గ్రామాలకు గాను 2023–24కు సంబంధించిన రూ.4.18 కోట్ల పనులపై సామాజిక తనిఖీ బృందం సెప్టెంబర్ 1 నుంచి సోషల్ ఆడిట్ నిర్వహించారు. సోషల్ ఆడిట్‌లో ఉపాధి పనులు, కూలీలు చెల్లించిన వేతనాలు తదితర అంశాలపై సామాజిక తనిఖీ చేపట్టగా పలు గ్రామాల్లో అవకతవకలు జరిగినట్లు నిర్ధారించారు. పనులకు హాజరుకాకపోయిన కూలీలకు హాజరు వేసి డబ్బులు డ్రా చేస్తున్నట్లు కూలీలు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించిన చాటింపు లేకుండా గ్రామ సభలు పెడుతున్నారని కూలీలు ఆరోపిస్తున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

గద్వాల అర్బన్: ఎస్సీ ఉపకులాల పోరాట సమితి ఉమ్మడి పాలమూరు జిల్లా అధ్యక్షుడిగా జిల్లాకు చెందిన హోలియో దాసరి రామచందర్ సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పథకాలను ఎస్సీ ఉపకులాలకు ముందుగా వర్తింజేయాలని కోరారు.